క్లుప్తంగా

జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే గణేష్



నర్సీపట్నం: శ్రీకాకుళం పర్యటనలో భాగంగా గురువారం విశాఖపట్నం విచ్చేసిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, తనయుడు అవినాష్, పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు మర్యాద పూర్వకంగా కలిశారు. జగన్‌మోహన్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు.

ముమ్మరంగా ఫార్మర్ రిజిస్ట్రీ



కె.జె.పురం సచివాలయంలో ఫార్మర్ రిజిస్ట్రీ

మాడుగుల రూరల్: గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద ఫార్మర్ రిజిస్ట్రీ ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. భూమి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రకటించడంతో గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలలో వీహెచ్‌ఏ, వీఏఏలతో ఈ ప్రక్రియ చేయించుకుంటున్నారు. రైతు భూమి పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, భూమి పాసుపుస్తకంతో ఆధార్ లింక్ ఉన్న ఫోన్ తీసుకుని చేస్తున్నారు. అయితే తరచూ సర్వర్ మొరాయిస్తుండటంతో వీఏఏ, వీహెచ్‌ఏలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పీఎంకిసాన్‌తోపాటు అన్నదాత సుఖీభవ వర్తించాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి చేసింది.

ఎమ్మెల్సీ అభ్యర్థి గాదెకు మద్దతుగా ప్రచారం

మాడుగుల రూరల్: ఈ నెల 27న జరిగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడుకు మద్దతుగా గురువారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. కె.జె.పురం, మాడుగుల హైస్కూలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఎం. కోడూరు, కింతలి, వీరనారాయణం, ఓమ్మలి, గాదిరాయి, జి. అగ్రహారం, నర్సయ్యపేట గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ప్రచారం చేశారు. పీఆర్టీయూ, ఎస్టీయూ, ఆవాస్ బాధ్యులు ఆనంద్ ప్రశాంత్, నాగరాజు, జగదీష్‌తో పాటు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దినాయుడు, వర్కింగ్ అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, పీఆర్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు బి. కాశీవిశ్వనాథ్, రాష్ట్ర కార్యదర్శి సత్యం నాయుడు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పరదేశి, అచ్యుతరావు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ రామారావు

గొలుగొండ: నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని ఎస్ఐ రామారావు తెలిపారు. జోగుంపేటలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. మొబైల్ డ్రైవింగ్, ఓవర్‌లోడ్, మితిమీరిన వేగంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జోగుంపేట, గొలుగొండ ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి ప్రచారం

నర్సీపట్నం: ఒక్క అవకాశం ఇవ్వాలని, సమస్యలను శాసన మండలిలో వినిపించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి కోరారు. సీఐటీయూ, యూటీఎఫ్ నాయకులతో కలిసి గురువారం ఆమె పాఠశాలలు, కళాశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు, జేవీవీ నాయకుడు కె.త్రిమూర్తులరెడ్డి, యూటీఎఫ్ నాయకులు ఎం.చిట్టియ్య, మోహన్, గాయిత్రి పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

చీడికాడ: మండలంలోని కోనాం డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థినులకు పరీక్ష సామగ్రిని అందించినట్లు పూర్వ విద్యార్థుల సంఘం స్వేరోస్ సభ్యులు తెలిపారు. 2007లో పాఠశాలలో చదివిన విద్యార్థినుల ఆర్థిక సహకారంతో ఇక్కడ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 160 మంది విద్యార్థినులకు వైస్.ప్రిన్సిపాల్ బ్లెస్సీ పరీక్ష సామగ్రి అందించారన్నారు. పరీక్షల్లో ఒత్తిడిని తగ్గించుకుని ప్రిపరేషన్‌పై అవగాహన కల్పించారు. స్వేరోస్ సంఘం నేతలు కనకరాజు, పూర్వ విద్యార్థినులు, సంఘం నేతలు శ్రీనివాసరావు, గణేష్, వై.ఏసుబాబు, పినపల్లి బ్రహ్మానందం, సంధ్య పాల్గొన్నారు.

జీడికి మంచు దెబ్బ

- మాడిపోతున్న పూత
- ఆందోళనలో జీడిరైతులు



పూతతో కళకళలాడుతున్న జనుము చేను



కొండపాలెంలో మంచు బారిన జీడితోట

రోలుగుంట: వాతావరణ ప్రభావంతో పొగమంచు విపరీతంగా కురుస్తోంది. దాంతో జీడిపూత మాడిపోతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది తీవ్రంగా పంట నష్టం తప్పదని వాపోతున్నారు. మండలంలో జీడితోటలు పూత దశలో ఉన్నాయి. పిందెలు వేసే దశలో పొగమంచుతో పూత మాడిపోయి నేల రాలిపోతోంది. మండలంలో 3,200 ఎకరాలపైగా జీడి తోటలున్నాయి. వరితో సమానంగా రైతులు జీడి సాగు చేస్తున్నారు. వరి తిండి గింజలకు కాగా, జీడి తోటు సాధారణ ఖర్చులకు ఆదాయం తెచ్చిపెడుతోంది. దీంతో రైతులు డిసెంబరు నెలాఖరు నుంచి జనవరి మొదటి వారంలో తోట గొప్పులు, కలుపు తీత పనులు పూర్తి చేసుకున్నారు. అందుకు తగ్గట్టుగానే తోటలు పూతతో వికసిస్తుండగా మంచు దెబ్బ పడింది. దీంతో తమ ఆదాయానికి గండి పడుతుందని రైతులు వాపోతున్నారు.

జనుము పంటకు మేలు చేస్తున్న పొగమంచు

మండల రైతాంగం ఖరీఫ్‌లో సాగు చేసిన వరిపంట కోత దశ ముగిసిన తర్వాత వాటి స్థానంలో పంట భూమిలో స్వల్పకాలిక పంట జనుము సాగు చేపట్టారు. ఈ పంట విత్తనాలు చల్లిన తర్వాత ఏ విధమైన పెట్టుబడి అవసరం ఉండదు. సాగు నీరు అవసరం ఉండదు. మంచు తడులు సరిపోతాయి. మండలంలో 900 ఎకరాలకుపై విస్తీర్ణంలో జనుము పంట వేశారు. ప్రస్తుతం చేను పూతతో కళకళలాడుతోంది.

మంచు తగ్గితే జీడి తోటకు మేలు



నేను మూడెకరాల పైబడి జీడితోట సాగు చేస్తున్నా. తోట గొప్పులు, కలుపు తీత పనులు జరిగాయి. పూత బాగుంది. ఈ తరుణంలో పొగమంచుతో పిందెలు వేసే పరిస్థితి కనిపించడం లేదు. దినవల్ల పంట నష్టం ఏర్పడితే ఆదాయానికి గండి పడుతుంది. రూ.1.50 లక్షలు నష్టపోతున్నా.

– రాజాన గజ్జన్న, తోట యాజమాని, కొండపాలెం గ్రామం

పిందె దశలో మంచు ప్రభావం



రెండెకరాల జీడితోట ఉంది. సాగు పనులు అన్ని పూర్తయ్యాయి. పూత బాగుంది. పిందె దశలో పొగమంచు ఉధృతి పెరిగింది. దీంతో పంట నష్టం తప్పదు. మంచు తగ్గితే కొంతమేర ఉపశమనం కలుగుతుంది. ఆదాయం కూడా వచ్చే అవకాశం ఉంటుంది.

– శనివాడ రాజబాబు, తోట యజమాని, శరభవరం గ్రామం

కౌలు కట్టడం కష్టమే



రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో మూడేళ్లకు జీడితోట కౌలుకు తీసుకున్నాను. ఎకరాకి రూ.35 వేలు కౌలు చెల్లించాల్సి ఉంది. అయితే ప్రారంభంలోనే మంచు దెబ్బ తీస్తోంది. పంట ఆదాయానికి గండిపడి కౌలు కట్టడం ఇబ్బందే. మంచు తగ్గితే కొంతైనా ఆదాయం వస్తుంది.

– శోంఠాన సత్యవతి, కౌలురైతు, కొండపాలెం గ్రామం, రోలుగుంట మండలం

వంద రోజుల 'ఉపాధి' కల్పించండి



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

మాకవరపాలెం: ఉపాధి కూలీలకు వంద రోజుల పని కల్పించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి సూచించారు. అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లతో గురువారం ఆమె తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దినసరి కూలీ రూ.280 వచ్చేలా కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. నిత్యం కూలీల సంఖ్య పెంచేలా కృషి చేయాలన్నారు. ఫారం పాండ్లు, ఇంకుడు గుంతల లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో వరలక్ష్మి, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు శిక్షణ నేడు

దేవరాపల్లి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్ర నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు, క్లాప్ మిత్రలకు శుక్రవారం ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు తెలిపారు. స్థానిక చెత్త సంపద కేంద్రం వద్ద శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 7 గంటలకు సంపద కేంద్రం నుంచి బయలు దేరి మెయిన్ రోడ్డు మీదుగా అవగాహన ర్యాలీ చేపడతామన్నారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి రామాలయ ప్రతిష్ట వేడుకలు

దేవరాపల్లి: మండలంలోని వేచలంలో సీతారామ సహిత విఘ్నేశ్వర స్వామి, లక్ష్మీదేవి ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మూడు రోజులు వేడుకలలో భాగంగా శుక్రవారం నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఊరేగింపు, యాగం, ఇతర పూజా క్రతువులను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆఖరి రోజు ఆదివారం ధ్వజస్తంభం, ఆలయ శిఖర, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాత్రికి రామాంజనేయ, గయోపాఖ్యానం యుద్ధ సన్నివేశాల ప్రదర్శన ఉంటుందన్నారు.

ఘనంగా నల్లమారమ్మ పండగ



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మాకవరపాలెం: మండలంలోని కొండలఅగ్రహారంలో నల్లమారమ్మతల్లి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఆరాధ్య దైవంగా కొలిచే గ్రామస్తులు ఉదయం నుంచి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఆలయ ధర్మకర్త గూడూరు వెంకటరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, పార్టీ నేత పోలిరెడ్డి రమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎం. కోడూరు శివాలయం అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మాడుగుల రూరల్: మండలంలోని ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి దాతలు రూ.లక్ష విరాళాన్ని గురువారం అందజేశారు. దివంగత చింత నారాయణమూర్తి, నారాయణమ్మ కుటుంబ సభ్యులు ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ చైర్మన్ చింతా వెంకటనారాయణమూర్తికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పడాల అప్పలనర్సయ్య, రాపర్తి సత్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు నిష్టల లక్ష్మీనారాయణ, నర్సింహమూర్తి, దాతలు వెంకట సత్యనారాయణ, కృష్ణారావు, ఎల్లారావు, శ్రీనివాసరావు, రాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ



శిక్షణలో కార్యకర్తలకు సూచనలిస్తున్న ఎంఈవో మూర్తి

మాడుగుల: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ మూడో రోజు గురువారం కొనసాగింది. ఇందులో భాగంగా స్థానిక జెడ్పీ బాలుర హైస్కూలులో ఎంఈవోలు బి. దేముడమ్మ, పాండురంగారావు శిక్షణ ఇచ్చారు. ప్రతి చిన్నారి మానసిక స్థితిని అర్థం చేసుకుని, ఆటపాటల ద్వారా బోధన చేయాలని సీడీపీవో సిహెచ్ శ్రీదేవి పేర్కొన్నారు. శిక్షకులుగా మణికాంత, కృష్ణ, రవి వ్యవహరించారు. సూపర్‌వైజర్లు నారాయణమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

నాతవరం: అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతుల్లో ఎంఈవో -2 కామిరెడ్డి వరహాల బాబు మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్రాల్లో చిన్నారులకు వివరించి అన్నివిధాలుగా తీర్చిదిద్దాలన్నారు. కోఆర్డినేటర్లు కూండ్రపు అర్జున కిశోర్, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నాగజ్యోతి, సూర్యప్రభ, సీఆర్పీలు పాల్గొన్నారు.

మాకవరపాలెం: అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ ముగిసింది. స్థానిక ఉన్నత పాఠశాలలో మూడు రోజులపాటు మండలంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. బోధన పద్ధతులపై ఎంఈవో మూర్తి అవగాహన కల్పించారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అచ్యుతరామయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమణమ్మ, సరోజిని పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడ సబ్ స్టేషన్ పరిధిలోని ఎం. అలమండ ఫీడర్‌లో 24 గంటల విద్యుత్ లైన్ మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున శుక్రవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు దేవరాపల్లి ఎలక్ట్రికల్ ఏఈ కె. శంకరరావు తెలిపారు. మునకాలాపల్లి, కొత్తపెంట, ఎన్.జి.నగరం, ఎం. అలమండ, ఎ. కొత్తపల్లి, ముషిడిపల్లి, యండపల్లిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.

వెంకన్నపాలెం సబ్ స్టేషన్ పరిధిలో

చోడవరం: వెంకన్నపాలెం సబ్ స్టేషన్ పరిధి 33/11కేవీ లైన్లలో మరమ్మతులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎస్ నర్సీపట్నం డీఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోవాడ, వెంకన్నపాలెం, అంబేరుపురం, గజపతినగరం, గంధవరం, నర్సాపురం, ఎం. కొత్తపల్లి, ముద్దుర్తి, జుత్తాడ, సింహాద్రిపురం, రాయపురాజుపేట, శీమునాపల్లి, భోగాపురం గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బుద్ధిమాంద్యం దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు

మాడుగుల రూరల్: బుద్ధిమాంద్యం దివ్యాంగ పింఛనుదారులకు నిర్ధారణ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయని ఎంపీడీవో కె. అప్పారావు తెలిపారు. అనకాపల్లి జిల్లా ఏరియా ఆస్పత్రిలో తొలి రోజు అవురువాడ, జి. అగ్రహారం, జాలంపల్లి గ్రామాలకు చెందిన 30 మంది దివ్యాంగులకు పరీక్షలు చేశారన్నారు. ఈ నెల 24, 25, 27 తేదీల్లో మిగిలిన గ్రామాలకు చెందిన దివ్యాంగులుకు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ఆటోను ఢీకొన్న బస్సు

చోడవరం: ఆగిఉన్న కారును బస్సు ఢీ కొనడంతో గురువారం బీఎన్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. బీఎన్‌రోడ్డులో చోడవరం- వెంకన్నపాలెం మధ్యలో రోడ్డు పక్కన వెళ్తున్న గూడ్సు ఆటో నుంచి ఆకస్మికంగా బస్తాలు అదుపుతప్పి కింద పడ్డాయి. వాటి కోసం ఆటోను ఆకస్మికంగా నిలిపివేయడంతో వెనుక వస్తున్న కార్లు, ఆటోలో ఒకదానువెనుక ఒకటి నిలిచిపోయాయి. ఇంతలో పాడేరు నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆగిఉన్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. రోడ్డు మధ్యలో రెండు వాహనాలు నిలిచిపోయి ఇరువురు మధ్య వాదనతో ట్రాఫిక్ చాలా మేర నిలిచిపోయింది. ఒక పక్క గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి వెళ్లే చెరకు లోడు బళ్లు, మరోవైపు అనకాపల్లి, విశాఖపట్నం, చోడవరం నుంచి వచ్చిపోయే వాహనాలు నిలిచిపోవడంతో చోడవరం పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 30 మంది ఎంపిక



కంటి రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: మండలంలోని ఎం. కోటపాడులో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. విశాఖ ఎల్.వి.ప్రసాదు నేత్ర వైద్యశాల సౌజన్యంతో జరిగిన ఈ శిబిరంలో 130 మందికి కంటి పరీక్షలు చేశారు. 30 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. ఉచితంగా కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఎం. కోటపాడు, వల్లాపురం ఉప సర్పంచ్‌లు శానాపతి గంగాధర్, కరణం రాము సహాయ సహకారాలందించారు. క్యాంపు సమన్వయకర్త ఆర్. సోములు, కంటి వైద్యులు సాయి, రాధిక, ఇందుమతి, గౌరీ, ఫీల్డ్ అసిస్టెంట్లు భూపతిదేవ్ సంతోష్, నందిత పాల్గొన్నారు.

167 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సాయికిరణ్

కె.కోటపాడు: ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను ఉపయోగించుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిరణ్ కోరారు. గురువారం ఎ.కోడూరు శివారు కొత్తూరు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలు చేశారు. 167 మందికి సాధారణ వైద్యంతో పాటు ఉచితంగా మందులు ఇచ్చారు. 14 మంది గర్భిణులకు తనిఖీలు చేయడంతో ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఎంఎల్‌హెచ్‌పీ.శాంతి, ఏఎన్ఎం సంతోషికుమారి పాల్గొన్నారు.

23న అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

మాడుగుల రూరల్: దొర్ల గొటివాడ శివారు గొల్లలపాలెం గ్రామంలో ఈ నెల 23న అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ధూపదీప నైవేద్యాలతో పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ బహుమతులుగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు అందజేస్తారన్నారు. గుర్రం పరుగు పందెం, పిడతలు, సైకిల్ పోటీలు, కోలాటం, తప్పెటగుళ్లు నిర్వహిస్తామన్నారు. రాత్రికి వివిధ సాంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

వడ్డాదిలో సంపద తయారీ కేంద్రం పరిశీలన



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలిస్తున్న డీపీవో శిరిషారాణి

బుచ్చెయ్యపేట: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ద్వారా గ్రామ పంచాయతీకి అదనపు ఆదాయాన్ని సముపార్జించవచ్చునని జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరిషారాణి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆమె వడ్డాదిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో తడి, పొడి చెత్తను వేరు చేసి, సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. మండల పంచాయతీ విస్తరణాధికారి విజయలక్ష్మి, పంచాయతీ కార్యనిర్వహణాధికారి లవరాజు, పారిశుధ్య కార్మికులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

పార్టీ మండల అధ్యక్షుల నియామకం



వేమవరపు రామధర్మజ



రెడ్డి జగన్‌మోహన్



బూరె బాబూరావు



గొల్లవిల్లి రాజబాబు

మాడుగుల: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం మాడుగుల నియోజకవర్గంలో నాలుగు మండలాలకు అధ్యక్షులను నియమించింది. వైఎస్సార్ సీపీ మాడుగుల మండలాధ్యక్షుడిగా వేమవరపు రామధర్మజ, చీడికాడ మండలాధ్యక్షుడిగా గొల్లవిల్లి రాజబాబు, దేవరాపల్లి మండలాధ్యక్షుడిగా బూరె బాబూరావు, కె. కోటపాడు మండలాధ్యక్షుడిగా రెడ్డి జగన్‌మోహన్ నియమితులయ్యారు.

పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే



యూత్ అధ్యక్షుడు శ్రీనివాసు



మహిళా అధ్యక్షురాలు నాగ గణలక్ష్మి



ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీను



బీసీ సెల్ అధ్యక్షుడు కన్నయ్యనాయుడు



మైనార్టీ సెల్ అధ్యక్షురాలు ఉన్నీసాబేగం



క్రిష్టియన్ మైనార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్



విద్యార్థి విభాగం అధ్యక్షుడు శ్రీనివాసరావు



పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు గోవిందరావు



లీగల్ సెల్ విభాగం అధ్యక్షుడు బుల్లిదొర



డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు లక్ష్మీకాంత్



ప్రచార విభాగం అధ్యక్షుడు సత్యనారాయణ



వైజ్ఞానిక విభాగం అధ్యక్షురాలు అరుణ



బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడు చంద్రశేఖర్

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు సంబంధించి నియోజకవర్గ అధ్యక్షులను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం జాబితాను విడుదల చేసింది. యూత్ విభాగం అధ్యక్షుడు తమరాన శ్రీనివాసు, మహిళా విభాగం అధ్యక్షురాలు బయపురెడ్డి నాగ గణలక్ష్మి, రైతు విభాగం అధ్యక్షుడు కొల్లు సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడు గొంప కన్నయ్యనాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మామిడి శ్రీనివాసు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బండి గంగరాజు, మైనార్టీ సెల్ అధ్యక్షురాలు షేక్ బషీర్ ఉన్నిసాబేగం, క్రిష్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బేతిరెడ్డి విజయ్‌కుమార్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు బొడ్డు గోవిందరావు, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు దాడి సత్య రామకృష్ణ, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు సుర్ల రమణ, వలంటీర్ల విభాగం అధ్యక్షుడు పరవాడ కవిశేశ్వరరావు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నల్లబెల్లి శ్రీనివాసరావు, వైజ్ఞానిక విభాగం అధ్యక్షురాలు దేవత అరుణ, చేనేత విభాగం అధ్యక్షుడు పంపన రమేష్, లీగల్ సెల్ విభాగం అధ్యక్షుడు మాకిరెడ్డి బుల్లిదొర, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు యల్ల సన్యాసినాయుడు, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు గొర్లి కామేశ్వరరావు, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు కన్నూరు గంగబాబు, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ పి.లక్ష్మీకాంత్, బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడు సుర్ల చంద్రశేఖర్, ప్రచార విభాగం అధ్యక్షుడు దేవాడ సత్యనారాయణ నియమితులయ్యారు.